


# సిద్ధార్థుడు

పెంటపాటి రాజేంద్రప్రసాద్

ఆ రోజు మా పార్టనర్స్ తో సమావేశం చాలా సంతృప్తికరంగా ముగిసింది. కంపెనీ వ్యవహారాల గురించి ఊరవతలి ఫార్మ్ హౌస్ లో మేము ఏర్పాటు చేసుకున్న మీటింగ్ అది. హుషారుగా ఉన్నాను. అలవాటు లేకపోయినా మర్యాద గురించి పుచ్చుకున్న ఒక్క పెగ్గు మందూ చాలా కిక్ ఇచ్చింది. అందరం ఇళ్లకు బయలు దేరాము.

మిగతా వాళ్ళందరూ సిటీవైపు ఉన్న వాళ్ళు. నేనొక్కడినే సిటీకి ఇటు చివర కొంచెం దూరంగా ఉన్నాను. సాయంత్రపు ప్రకృతి చాలా అందంగా,హాయిగా కనిపిస్తోంది. అద్దాలు దింపేశాను. చల్లటి గాలి పలకరించింది. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉన్నది. అప్పుడొకటీ,ఇప్పుడొకటీ కార్లు వెళుతున్నాయి. నాకు తెలియకుండానే స్పీడు పెరిగి నూట ఇరవై చూపిస్తున్నది. అడ్డం ఏమీ లేనందువల్ల నేనూ పట్టించుకోకుండా అలాగే డ్రైవ్ చేస్తూ వెళుతున్నాను.

"అరె! ఏమిటది? రోడ్డుకడ్డంగా తాపీగా వెళుతోంది ఓ గేదె...కాలు హఠాత్తుగా యాక్సిలేటర్ మీంచి తీసి బలంగా బ్రేక్ నొక్కాను. గేదెను తప్పిస్తూ స్టీరింగ్ ను ఎడమ వైపుకు తిప్పాను. ఆ క్షణమే నాకు తెలుసు. మళ్ళీ కళ్ళు తెరిచేటప్పటికి ఒళ్ళంతా భయంకరమైన బాధ. నేను ఎక్కడ ఉన్నానో నాకు తెలియలేదు. నా చుట్టూరా అన్నీ చెట్లు..మట్టి..రాళ్ళు... స్పృహ తప్పింది.

★★★

చుట్టూ ఏదో వాసన. దుర్గంధమా! కాదు...సువాసనా!...కాదు...కళ్ళు తెరిచాను. ఎర్రగా..నీలంగా ఏవేవో అక్షరాలు ముద్దగా కనిపిస్తున్నాయి. చదవడానికి ప్రయత్నించాను. అన్నీ నెంబర్లే.. కదిలిపోతూ ఉన్నాయి. నిద్ర వస్తోంది.

"స్పృహ వచ్చి పోతోందమ్మా! మన చేతుల్లోకంటే...." మాటలు ముద్ద ముద్దగా వినిపించాయి. నాకెందుకులే అని మత్తుగా పడుకున్నాను.

మళ్ళీ మెలకువ వచ్చింది. ఇప్పుడు నాకు పూర్తిగా తెలిసింది. నేను బెడ్ మీద పడుకుని ఉన్నాను. చుట్టూ చూశాను. నా వాళ్ళందరూ కనిపించారు. నెమ్మదిగా... నెమ్మదినెమ్మదిగా మళ్ళీ ఆ దృశ్యం కరిగిపోతున్నది. పదినిమిషాలయినట్టు అనిపించింది. ఇప్పుడెందుకో ఒళ్ళంతా తేలిగ్గా ఉంది. ఏ బాధా లేదు. ఈ సారి పైన పైపైన ఉన్నట్టు తోచింది. మెల్లగా మంచం మీద ఉన్న నేనూ, చుట్టూ ఉన్న నా వాళ్ళూ కనిపించసాగారు. నేను ఈ ముప్పై అయిదేళ్ళూ పెంచి పోషించి, మోసిన శరీరం, నేననబడే, నాలోని, నాకు ఆశ్రయమిచ్చిన శరీరం..అదుగో... బెడ్ మీద పడి ఉన్నది. నేనేమో దాన్ని నా శరీరం అనుకుంటున్నాను. బెడ్ మీద పడి ఉన్న నా పూర్వపు శరీరానికీ, నాకూ కూడా ఇప్పుడు ఏ బాధలూ లేనట్టుగా హాయిగా ఉంది. మరి 'నేను' అంటే ఎవరు? కారులోంచి పడిపోయి, నా ఇప్పటి స్థితికి కారణమై అచేతనంగా పడి ఉన్న శరీరమా, లేదంటే అప్పుడూ, ఎప్పుడూ సచేతనంగా ఉన్న ఈ 'నేనా?'

ఏమో! మహామహులనుకున్నవారే చెప్పలేనిది నేనేం చెప్పగలను?

ఇదే కాబోలు మరణమంటే. మంచం మీద ఉన్న శరీరం వైపు చూశాను. నా శరీరానికి ఆక్సిజన్ అందుతోంది. వెంటిలేటర్ వల్ల కాబోలు గుండె మామూలుగానే కొట్టుకుంటోంది. నేను మరణించినా శరీరాన్ని మరణించనివ్వకుండా డాక్టర్లు కాపాడుతూ ఉన్నారు. మానవుడి ప్రతిభకు జోహార్లు అర్పించాలని అనిపించింది. కానీ నేను చనిపోయినా బ్రతికి ఉన్నానని అనుకొంటున్న వాళ్ళ అమాయకత్వం మీద జాలి కూడా వేసింది.

ఐ.సీ.యూ. లోంచి బయటకు వచ్చిన డాక్టర్లు తిన్నగా బయటకు ఒక మూలగా నిలబడి ఉన్న నా భార్య దగ్గరకు వెళ్లారు. కన్నీళ్ళతో నిండి ఉన్న ఆమె నిరామయంగా వారి వైపు చూసింది.

వారిలో పెద్ద డాక్టర్ కాబోలు..గొంతు సవరించుకొన్నారు. ఆమె వైపు క్షమాపణ కోరుతున్నట్టుగా చూస్తూ "మేడమ్! మీకు ఈ విషయం ఎలా చెప్పాలో తెలియటం లేదు..." వాళ్ళు అలా అనగానే ఆమెకు దుఃఖం పొంగి వచ్చింది. కంటినుండి జల జలా కన్నీళ్లు రాలాయి. ఆమె ప్రక్కనే కూర్చున్న నాన్న, అమ్మ ఒకే సారి నిలబడి ఆత్రంగా అడిగారు. "ఏమిటి డాక్టర్!" అంటూ.

డాక్టర్ తటపటాయించాడు. చివరకు నిశ్చయించుకొని ఇలా అన్నాడు. "చూడండి సర్! జరిగిన ప్రమాదం చాలా తీవ్రమైనది. మీ అబ్బాయి తలకు బలమైన గాయం తగలడం వలన అతని బ్రెయిన్ డెడ్ అయ్యింది. అంటే ఇక పనిచెయ్యకుండా పోయింది..." ఊపిరి తీసుకోవడానికన్నట్టు ఒక్క క్షణం ఆగాడాయన.

"అంటే?" అపనమ్మకంగా, భయంగా చెడువార్త నిశ్చయమేనని ఊహించిన భయంతో అన్నది తను.

"అంటే అతను బ్రతికున్నా ఏ ప్రయోజనమూ లేదమ్మా! అతనిలో గుండె, ఊపిరితిత్తులూ తప్ప మిగతా ఏ అవయవాలూ పని చెయ్యవు. వెంటిలేటర్ మీద, కృత్రిమశ్వాస మీద ఎన్ని రోజులంటే అన్ని రోజులు ఆయన్ని అలా ఉంచవచ్చు. కానీ అందుకు చాలా అంటే చాలా... ఖర్చవుతుంది. ప్రయోజనమూ లేదు. ఆయన ఎన్నాళ్ళైనా అలాగే

ఉండవలసి ఉంటుంది. ఆ పైన నిర్ణయం మీది." చెప్పేసి ఇక వారివైపు చూడలేక ముఖం తిప్పుకున్నాడు డాక్టర్. మా అమ్మా నాన్నలూ, తనూ జీవచ్ఛవాల్లా కూలబడిపోయారు.

వేరే ఒక రూమ్ లో నా ఆధార్ కార్డును కంప్యూటర్లో ఉంచి స్కాన్ చేస్తున్న అమ్మాయి ఒక్కసారిగా సీట్ లోంచి లేచి డాక్టర్ దగ్గరికి వేగంగా వెళ్లి ఏదో చెప్పింది. డాక్టర్ తల పంకించాడు. ఒకసారి ఆలోచించుకుని వెనక్కి తిరిగాడు.

★★★

నేను ఇక్కడే హాస్పిటల్ లోనే ఉన్నానని అనుకుంటూ ఉన్నాను. కాని నా ప్రమేయం ఏమీ లేకుండానే భూ,జల,వాయురాకాశాగ్నుల బంధాలన్నీ తెంచుకుని హాస్పిటల్ గోడలూ, పై కప్పూ, చెట్లూ, కొండలూ, మేఘాలూ అన్నిటినీ దాటి కొన్ని లక్షల మైళ్ళ వేగంతో అనంత శూన్యంలోకి నా ప్రయాణం మొదలైంది.

నా కోసం నా ఒంటిమీద పడి గుండెలు బాదుకుంటూ హృదయవిదారకంగా ఏడుస్తున్న నా భార్యా, అమ్మా, నాన్నా, ఆశ్చర్యంగా చూస్తున్న మా పాపా, ఎక్కడో దూరంగా బొంబాయి నుండి ఆఘమేఘాల మీద బయలుదేరిన చెల్లీ, బావగారూ, మా అత్తగారూ, మామగారూ అందరూ నాకు ఒకేసారిగా కనిపిస్తున్నారు.

కర్మేంద్రియాలూ, జ్ఞానేంద్రియాలూ అన్నీ స్తంభించిపోయిన నాకు మనస్సనే ఒకే ఇంద్రియం ద్వారా ఇప్పుడన్నీ తెలుస్తున్నాయి. భూమిమీద ఉన్నప్పుడు నాకున్న ఎన్నో సమస్యలకు పరిష్కారాలు ఇప్పుడు నాకు ఒక్కసారిగా తెలిసిపోయాయి. "వీటి గురించా నేను ఆరాటపడ్డది!" అని ఆశ్చర్యంగా అనుకున్నాను. మనిషికి ఎప్పటికైనా తప్పని మరణమంటే ఏమిటో తెలియక ఎప్పుడూ భయంగానే ఉండేది. కానీ ఇప్పుడు.. "మరణం అంటేనే పరిష్కారమన్న మాట!" అని అనిపించింది.

నేను ఎంతో వేగంగా పైకి పైపైకి వెళిపోతున్నట్టు తెలుస్తోంది. నాకు చుట్టుపక్కల అన్నిదిక్కుల్లోనూ చూశాను. నాలాగే అనేకమైన కాంతి పుంజాలు కొన్ని లక్షల సంఖ్యలో అతివేగంగా పైకి సాగిపోతున్నాయి. విచిత్రంగా ఆ కాంతిపుంజాలు భూలోకంలో ఉన్నప్పుడు ఏయే పేర్లతో ఉండేవో, ఏయే ఆకారాల్లో ఉండేవో, వాళ్ళ భాషా, దేశమూ చుట్టాలూ, పక్కాలూ ఎవరెవరో అన్నీ తెలుస్తున్నాయి. వాళ్ళ వాళ్ళందరూ ఏం చేస్తున్నారో వీళ్ళ గురించి ఎవరెవరు ఎలా ఎలా బాధపడుతున్నారో అన్నీ నాకు తెలుస్తున్నాయి. ఇవన్నీ ఒకేసారి నాకు ఎలా తెలిశాయో నాకే తెలియటం లేదు.

ఏ భాషకూ, మతానికీ, కులానికీ, సంస్కృతికీ, దేశానికీ ఎల్లలు కనిపించటం లేదు. అందరి బాధా ఒకే తీరు. అందరి సంతోషమూ ఒకే తీరు. మనం కల్పించుకున్న భేదాలన్నీ నాకు చిన్నపిల్లలు నది ఒడ్డున ఇసుకలో కట్టుకునే బొమ్మ ఇళ్ల గోడల్లాగా కనిపిస్తున్నాయి. మనకై మనం ఏర్పరుచుకున్న ఈ అజ్ఞానానికి అంతం లేదనిపిస్తోంది.

హఠాత్తుగా ఒక ఆలోచన వచ్చింది. నా శరీరం నుండి నేనూ, వాళ్ళ శరీరాలనుండి వాళ్ళూ విడిపోయి ఇలాగ హాయిగా ప్రయాణిస్తున్నామంటే మరణమనేది ఇంత హాయిగా ఉంటుందా! మరెందుకు మనుషులంతా మరణానికి భయపడతారు?

ఈ శరీరం ఉన్నన్నాళ్ళూ తన భావాలనూ, ప్రేమనూ, బాధలనూ పంచేంద్రియాల ద్వారా అందరికీ అందించింది. అలాగే వారి భావాలనూ, భయాలనూ, అనురాగాన్నీ, దయనూ వాళ్ల వాళ్ళకి ఆ శరీరమే, ఇంద్రియాల ద్వారా పంచింది. అటువంటి అంత విలువైన పరికరం ఉన్నట్టుండి పాడైపోతే, రిపేరన్నదే లేదూ, శాశ్వతంగా మరచి పొమ్మంటే కష్టంగానూ, బాధగానూ ఉండదా? శరీరం మాయమై పోతే, తను తన వాళ్లకూ, వాళ్ళు తనకూ పంచిన అనుభూతులన్నీ శాశ్వతంగా దూరమైపోతాయి కాబట్టి. ఆ శరీరం మరణిస్తే 'నేను' అనే ఆత్మను కూడా ఎక్కడికో పంపించేస్తుంది కాబట్టి.. వాళ్లంతా ఇంతటి బాధనూ తాత్కాలికంగానైనా సహించక తప్పదు.

వాసాంసి జీర్ణాని యథా విహాయ...నవాని గృహ్ణాతి నరో పరాణి

తథా శరీరాణి విహాయ జీర్ణా..న్యన్యాని సంయాతి నవాని దేహీ

మానవుడు పాత వస్త్రమును త్యజించి నూతన వస్త్రమును ధరించినట్టు ఆత్మ, శిథిలమైన శరీరమును వీడి నూతన శరీరమును చేరును. నిజమే కానీ....

నేను నా శరీరాన్ని శిథిలం కానివ్వను. నేను నా శరీరాన్ని చిన్నవయసు లోనే..అవయవాలన్నీ శిథిల స్థితికి చేరకముందే వదిలిపెట్టాను. భగవంతుడు బహుశా నా కోరిక మన్నించడానికే నాకిలా మరణం ప్రసాదించాడేమో?

★★★

అదుగో! డాక్టర్ వస్తున్నారు. నా చివరి కోరిక..కాదు కాదు..నా జీవితాశయాన్ని నా భార్యకు చెప్పడానికి. అదుగో.. చెప్పేశారు..

నా భార్య ముఖం ఒక్క నిమిషం మ్లానమైంది. ఆమె కళ్లనుండి జల జలా కన్నీరు. నా విగత శరీరాన్ని గాఢంగా, ఎన్నడూ లేనంత ప్రేమగా కౌగిలించుకుంది. మరు క్షణం నా ఆఖరి కోరికను కాదనకూడదనే వివేకం ఆమెను తట్టి లేపింది. ముఖంలో ఏ భావమూ కనపడనివ్వకుండా డాక్టరు గారి వైపు చూసి "అలాగే!" అన్నట్టు తలూపింది. ఆమెకు తండ్రి వయసులో ఉన్న ఆ డాక్టర్ కళ్ళల్లో కూడా ఉన్నట్టుండి పలుచని తడి కనిపించింది. తలమీద చెయ్యి వేసి "భగవంతుడు నిన్నూ, నీ బిడ్డనీ తప్పక ఆశీర్వదిస్తాడమ్మా! ఎక్కువ సమయం లేదు. మరి కానివ్వనా!" అన్నారు. కన్నీటితో నిండిన కనులను తుడుచుకోవాలనే ధ్యాసే లేకుండా ఆమె తల ఊపింది.

ఏర్పాట్లు మొదలయ్యాయి. డాక్టర్లందరూ కలిసి చర్చించుకుని అతి శీఘ్రంగా పని మొదలు పెట్టారు. మొదటి స్కాల్ పెల్ నా దేహం లోకి దిగింది. నా దేహాన్ని ఓపెన్ చేశారు. మరికొన్ని పరికరాలు ఉపయోగించి నా కళ్ళూ, మూత్ర పిండాలు, కాలేయమూ లాంటి అవయవాలు వేరు చేశారు. ఇంకా కొట్టుకుంటూనే ఉన్న నా గుండెను బయటికి తీశారు. అలా తీసిన గుండెను వెంటిలేటర్ తో పాటు ఒక బాక్సులో భద్రపరిచారు. ఎక్కడికో అత్యంతవేగంగా తరలించారు. మరికొద్ది గంటల్లోనే మృత్యుశయ్య మీద ఉన్న ఒకరికి నా హృదయాన్ని అమర్చారు.

కాంతిపుంజం లాంటి నా శరీరమంతా మరింత కాంతి నిండింది. నా మనసంతా ఎంతో హాయి నిండింది. ఎట్టకేలకు నా కోరిక తీరింది. ఇలా ప్రమాదం జరుగుతుందని నేను ఊహించి ఉండకపోయినా, నా అవయవాలు మరణానంతరం వృధాగా మట్టిలో కలిసి పోకూడదనీ ఎలాగో ఒకలాగా వైద్య విద్యార్థులకైనా ఉపయోగపడాలనీ కోరుకొని అవయవదానం చేశాను. కానీ నేను ఇప్పుడు నా అదృష్టవశాత్తూ, పూర్వజన్మ పుణ్యఫలం వల్ల కాబోలు..మరణించి కూడా జీవించగలుగుతున్నాను.

అనంతశూన్యంలో నా ప్రయాణం కొనసాగుతోంది. ఎందుకో నేను అందరికంటే వేగంగా వెళుతున్నానని అనిపిస్తోంది. నేను చేరుకోవాల్సిన దివ్యజ్యోతి నాకు దగ్గరగా కనిపిస్తోంది.

భూమివైపు చూశాను. నా శరీరం నుండి వేరు చేసిన కళ్ళలోని కార్నియాలను ఇద్దరు వేరు వేరు వ్యక్తులకు అమర్చారు. వారిద్దరూ ఇక ఈ లోకంలోని అందాలను చూడగలుగుతారు. నా కళ్లలోని మిగతా భాగాలను భద్రపరిచారు. రెండు మూత్రపిండాలనూ ఇద్దరికి అమర్చారు. అలాగే మిగతా అవయవాలు అన్నీ ఎవరెవరికో అవసరం ఉన్న వారికి చేరాయి. వేరే వేరే మతాల, జాతుల, భాషల వారిలో అవన్నీ నా కన్నుల పండువగా మళ్లీ పనిచేస్తూ ఉన్నాయి. వాళ్ల కళ్ళల్లోని, వారి ఆత్మీయుల కళ్ళల్లోని ఆనందం నా ఆత్మీయుల బాధను కొంతైనా మరచి పోయేలా చేయాలని దేవుడ్ని వేడుకున్నాను.

ట్రాన్స్ ప్లాంటేషన్ చేయలేని మిగతా శరీర భాగాలన్నింటినీ కొన్నిరకాల ద్రవాలలో భద్రపరిచి మెడికల్ కాలేజీలకు పంపించారు. వైద్యవిద్యను చదవబోయే భావి డాక్టర్ల చదువుకు అవి ఉపయోగపడతాయి. నా కోరిక మేరకు నా శరీరం లోని అన్ని భాగాలూ ఎవరో ఒకరికి ఎలాగో ఒకలాగ ఉపయోగపడుతున్నందుకు నాకు ఎంతో తృప్తిగా అనిపించింది.

నా ప్రయాణం రెండవరోజుకు చేరుకుంది. నా భార్య కోరిక మేరకు నా శరీరంలోని అవయవాలు తొలగింపబడిన సంగతి మా తల్లిదండ్రులకు ఏ మాత్రమూ చెప్పకుండానే వారికి నా కుట్లు కుట్టిన దేహాన్ని అందచేశారు. నా భౌతిక దేహానికి అంత్యక్రియలు జరుగుతూ ఉంటే అధిభౌతిక దేహంతో ఉన్న నేను చూస్తూ ఉన్నాను. నాతో పాటు మరణించిన అనేక మంది దేహాలు వృధాగా ఖననమో, దహనమో అయిపోవడం కూడా నాకు కనిపిస్తున్నది. భారంగా నిట్టూర్చాను.

రోజులు గడుస్తూ ఉన్నాయి. నేను అనేక లోకాలు దాటి ముందుకు పోతూ ఉండడం తెలుస్తున్నది. ఎక్కడికి వెళ్ళినా మన లోకం కనిపిస్తూనే ఉంది. నా అవయవాలు అమర్చిన పేషంట్లు కోలుకుని ఒక్కరొక్కరుగా నా ఆత్మ శాంతించాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నారు. నా మిగతా అవయవాలు కాలేజీల్లో ప్రయోగశాలల్లో బోధనకు ఉపయోగ పడడం కూడా నాకు కనిపిస్తోంది. పది రోజులు గడిచాయి. మా ఇంట్లో ఆచారప్రకారం ఏవేవో కార్యక్రమాలు జరుగుతూ ఉన్నాయి.

నా భార్య నన్ను తలుచుకుని నా జ్ఞాపకాలతో ఉక్కిరి బిక్కిరవుతూ కన్నీరు మున్నీరవుతోంది. ఆమెను అందరూ ఓదారుస్తున్నారు. అంతలోనే ఎవరెవరో వచ్చి ఆమె చేతులు పట్టుకుని కృతజ్ఞతలు చెపుతుంటే ఆ కన్నీళ్లు ఆనంద బాష్పాలుగా మారుతున్నాయి. కేవలం కాంతిరూపమైన నా శరీరం పులకింతతో అంతకంతకూ కాంతిని పుంజుకుంటూ ధగద్ధగాయమానంగా మెరిసిపోతోంది. పెనుచీకటికవతల మహా మహోన్నతమైన కాంతిపుంజమేదో తన వెలుగు చేతులు చాచి నన్ను తనలో కలుపుకుంటోంది.

జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ

తస్మాదపరిహార్యే ర్థే ... న త్వం శోచితుమర్హసి

పుట్టినవాడు మరణించక తప్పదు. మరణించిన వాడు మరల పుట్టుటయు నిశ్చయము. అనివార్యమైన ఈ విషయము గూర్చి శోకింపతగదు.

అవును! శోకించవలసిన అవసరమే లేదు. ఒక్క మనిషిగా మరణించిన నేను ఎంతోమందిగా మళ్ళీ పుట్టాను. ఇంతటి అదృష్టం ఎంతమందికి?

★★★

COMMENTS